సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 11 । జనవరి । 2024



ధర్మ ప్రచార మహోత్సవాలు

తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయంలో ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 29 వరకు ధర్మ ప్రచార మహోత్సవాలు నిర్వహించనున్నట్టు మంత్రి కొట్టు తెలిపారు. 8లో ▸



భారీగా తాబేళ్ల పట్టివేత

నాటు తాబేళ్లను తరలిస్తున్న ముఠా తాబేళ్లతో నింపిన బస్తాలను వదిలి పరారైన ఘటన కలిదిండి మండలం సానారుద్రవరంలో చోటుచేసుకుంది. 8లో ▸



శ్రీవారి గ్రామోత్సవం

ద్వారకాతిరుమల: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా చినవెంకన్నకు బుధవారం నిర్వహించిన గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. ప్రత్యేక పూజలు జరిగాయి.

న్యూస్‌రీల్

ప్రో కబడ్డీ పోటీలు అభినందనీయం



బహుమతి అందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: మూడు జిల్లాల ప్రో కబడ్డీ పోటీలు తణుకులో నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి యలమరెడ్డి శ్రీకాంత్ ఆధ్వర్యంలో కృష్ణా, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహించిన ప్రో కబడ్డీ పోటీలు బుధవారంతో ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కారుమూరి మాట్లాడుతూ క్రీడాపోటీల నిర్వహణకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ కబడ్డీకి ఉపయోగించే ఖరీదైన మ్యాట్‌లు ఇప్పించమని కోరిన వెంటనే తణుకు, వేల్పూరు కబడ్డీ జట్లకు గతంలో రెండు జతల మ్యాట్ సెట్‌లను మంత్రి కారుమూరి ఉచితంగా అందజేశారని కొనియాడారు. అనంతరం విజేతగా నిలిచిన విజయవాడ స్పైక్ టీం సభ్యులకు మంత్రి కారుమూరి రూ.30 వేలు బహుమతిగా అందజేశారు. దువ్వ సర్పంచ్ అడ్డా బాబు, వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్ర, రేలంగి నాయకులు చేబ్రోలు పెద్దిరాజు పాల్గొన్నారు.

జిల్లా పరిశ్రమల అధికారిగా మంగపతిరావు



భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా యు.మంగపతిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతిపై ఇక్కడకు జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా వచ్చారు. జిల్లా పరిశ్రమల అధికారిగా పనిచేస్తున్న ఉయ్యాల ఆదిశేషు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది ఏలూరు జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా నియమితులై బదిలీపై వెళ్లారు.

2,209 మందిపై బైండోవర్ కేసులు

పాలకొల్లు సెంట్రల్: జిల్లాలో కోడిపందేలకు సంబంధించిన వ్యక్తులను బైండోవర్ చేశామని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. బుధవారం ఎన్నికల పరిశీలనలో భాగంగా గత ఎన్నికల్లో బైండవర్ అయిన కేసులపై ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాంబ్లింగ్, కోడిపందేలు, కత్తులు తయారు చేసేవారు, కత్తులు కట్టేవారు ఇలా మొత్తం 2,209 మందిని బైండోవర్ చేసినట్టు చెప్పారు. అలాగే జిల్లాలో కోడిపందేలకు సిద్ధం చేస్తున్న బరులు ఉంటే దున్నిస్తున్నామన్నారు. గత ఎన్నికల సమయంలో వివాదాస్పదమైన గ్రామాలు, ఎవరిపై కేసులు ఉన్నవి వివరాలు పరిశీలిస్తున్నామన్నారు. నరసాపురం డీఎస్పీ మనోహరాచారి పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు: నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొని ప్రదర్శన కళల విభాగంలో ప్రతిభ చాటారు. జానపద బృందగానం విభాగంలో వై.సుప్రియ బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఈ బృందం ఈనెల 12 నుంచి 16 వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే 27వ యువజనోత్సవాల్లో పాల్గొంటుంది. వీరిని డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ అభినందించారు.

ఆన్‌లైన్‌లో ఉపాధి నమోదు

ఏలూరు(మెట్రో): నిరుద్యోగ యువత ఎక్కడి నుంచైనా ఎంప్లాయిమెంట్ నమోదును ఆన్‌లైన్ ద్వారా చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లు / మోడల్ కెరీర్ సెంటర్లు ద్వారా అందించే సేవలను భారత ప్రభుత్వ నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) పోర్టల్‌తో ఆన్‌లైన్‌లో అనుసంధానించడమైందన్నారు. ఈ ఆన్‌లైన్ సేవలు (ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యూవల్, అదనపు అర్హతల నమోదు) ఎంప్లాయిమెంట్ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ ద్వారా అందిస్తున్నామన్నారు. జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం అధికారి అభ్యర్థనను ఆమోదించిన పిదప ఎస్ఎంఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ నంబర్ తెలియజేస్తారన్నారు.

భూహక్కు పదిలం

రీ సర్వే విజయవంతం
- శాశ్వత భూ హక్కు-భూ రక్షలో సర్వే
- జిల్లాలోని 318 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి
- 167 గ్రామాల్లో ప్రక్రియ పూర్తి
- 75,977 సర్వే రాళ్ల ఏర్పాటు
- 52,657 మంది రైతులకు హక్కు పత్రాల పంపిణీ



అజ్జమూరులో సర్వే పూర్తి చేసిన తర్వాత సరిహద్దు రాళ్లు పాతిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

ఆకివీడు: సరిహద్దు తగాదాలు, భూ హక్కుల వివాదాలకు స్వస్తి చెప్పి భూమి యజమానికి శాశ్వత భూ రక్ష కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష కార్యక్రమంలో రీసర్వే జిల్లాలో విజయవంతంగా సాగుతోంది. శతాబ్ద కాలం క్రితం చేపట్టిన భూ సర్వేతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఇన్నేళ్లకు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం ద్వారా మళ్లీ రీ సర్వే ప్రారంభించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సరిహద్దులకు పక్కాగా నిర్ధారించి సర్వే రాళ్లు పాతి, భూమి యజమానులకు హక్కు పత్రాలను అందజేస్తున్నారు. జిల్లాలోని 318 గ్రామాల్లో 5,56,539.28 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే ప్రణాళికాబద్ధంగా, పారదర్శకంగా నిర్వహిస్తూ సరిహద్దులు నిగ్గు తేలుస్తున్నారు.

డ్రోన్ల సహకారంతో..
జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్‌లలో డ్రోన్ సర్వే 318 గ్రామాల్లో పూర్తయ్యింది. మొగల్తూరులో సీఓఆర్ఎస్ (క్రాస్ ఆర్జిన్ రిసోర్స్ షేరింగ్) బేస్‌స్టేషన్ ద్వారా సర్వే చేపట్టారు. 65 రోవర్లు, ఐదు డ్రోన్లు, 20 ల్యాబ్‌టాప్‌లు, 20 కంప్యూటర్లుతో రికార్డు దాఖలా సర్వే వేగవంతంగా కొనసాగుతోంది. ఇప్పటివరకూ రికార్డు దాఖలా 167 గ్రామాల్లో 2,62,306.73 ఎకరాల విస్తీర్ణంలో రీసర్వే పూర్తి చేశారు.

- సర్వే పూర్తి చేసిన భూముల్లో రైతుల అంగీకారంతో మొదట విడతగా 18,928, రెండో విడత 49,880 సర్వే రాళ్లు పాతారు. మూడో విడతలో 31,433 సర్వే రాళ్లకు 7,169 సర్వే రాళ్లు పాతించారు.
- సర్వే పూర్తి చేసుకుని, సరిహద్దులు నిర్ణయించిన రైతులకు మొదట విడతగా 6,258 భూ హక్కు పత్రాలు, రెండో విడతలో 30,199 పత్రాలు, మూడో విడతలో 97 గ్రామాల్లో సర్వే జరగ్గా, 41 గ్రామాల్లోని రైతులకు 16,200 భూ హక్కు, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ చేశారు.
- నాల్గో విడత జగనన్న భూ హక్కు రీ సర్వే 151 గ్రామాల్లో చేయాల్సి ఉంది. దీనిలో సుమారు 1.32 లక్షల మంది రైతులు ఉన్నారు. దీనిలో పెద్ద కమతాలున్నాయి. ఆయా గ్రామాల్లో 2,94,232 ఎకరాల్లో సర్వే చేపట్టాల్సి ఉంది.
- జేసీ, ఆర్డీఓల పర్యవేక్షణలో రీ సర్వే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. జిల్లాలోని భీమవరం, నరసాపురం, తాడేపలిగూడెం రెవెన్యూ డివిజన్‌లలో డివిజన్ అధికారులు, జిల్లాస్థాయిలో కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్, సర్వే భూ రికార్డుల శాఖ, మండల రెవెన్యూ అధికారులు, సర్వేయర్ల పర్యవేక్షణలో రీ సర్వే వేగం పుంజుకుంది.

పారదర్శకంగా రీ సర్వే



జిల్లాలో రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా సాగుతోంది. ఇప్పటివరకు 50 శాతానికి పైగా సర్వే పూర్తయ్యింది. మూడు విడతల్లో 2,62,306.73 ఎకరాల్లో సర్వే చేశాం. సర్వే పూర్తయిన గ్రామాల్లోని 52,657 మంది రైతులకు భూహక్కు పట్టాల్ని అందజేశాం.
– కె.జాషువ, జిల్లా సర్వేయర్, భీమవరం

పక్కాగా జరిగింది



రీ సర్వే పక్కాగా జరిగింది. అజ్జమూరులో నాకు సంబంధించిన భూమి రికార్డులు గతంలో తప్పుగా ఉన్నాయి. ఆయా సర్వే నంబర్లలో ఉన్న భూమిని సరిచేసి నా పేరున పట్టాదారు పాస్ పుస్తకం ఇచ్చారు. సీఎం జగన్‌కు ధన్యవాదాలు.
– యరగోగు రంగనాయకమ్మ, అజ్జమూరు, ఆకివీడు మండలం

రిమార్కు లేకుండా..



తరటావలో మా భూమి హద్దులు అన్నీ రీ సర్వేలో సక్రమంగా ఉన్నాయి. రీ సర్వే ద్వారా మా పూర్వీకుల భూమి హద్దులు యథావిధిగా ఉండటం మాకు ఆనందంగా ఉంది. ఉచితంగా సర్వే చేసి హక్కు పత్రాలు ఇచ్చిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.
– బోయిన శ్రీనివాసరావు, తరటావ, ఆకివీడు మండలం

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

కలెక్టర్ ప్రశాంతి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన నెలాఖరులోపు పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో ఆమె సమీక్షించారు. పోలింగ్ స్టేషన్‌కు వెళ్లడానికి, బయటకు రావడానికి వేర్వేరు ద్వారాలు లేదా ఒకే పెద్ద ద్వారం ఉంటే పార్టిషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటుచేయాలన్నారు. దివ్యాంగులకు వీలుగా ర్యాంపులను సిద్ధం చేయాలన్నారు. లైటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అవసరమైన చోట హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పూర్తిస్థాయిలో ఫర్నిచర్ కూడా ఉండాలన్నారు. పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులను డీఈఓ చూడాలని, పట్టణ ప్రాంతాల్లోని కమ్యూనిటీ హాల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, వ్యవసాయ, అసోసియేషన్ హాల్స్‌ను మున్సిపల్ కమిషనర్లు సిద్ధం చేయాలన్నారు. డీఈఓ ఆర్‌వీ రమణ, సమగ్ర శిక్షణ పీఓ శ్యాంసుందర్, ఈఈ రమా కుమారి, ఆర్అండ్‌బీ ఈఈ లోకేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, ఎన్నికల తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు గుర్తించాలి

కలెక్టర్ ప్రశాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వం నుంచి అందిన జర్నలిస్టుల అర్హుల జాబితాను పరిగణనలోకి తీసుకుని వారి ఇళ్ల స్థలాల కోసం అనుకూలమైన ప్రాంతాన్ని పరిశీలించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల గుర్తింపుపై అధికారులు, పాత్రికేయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జర్నలిస్ట్ సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, జర్నలిస్టులకు కేటాయించాల్సిన స్థలాలను గుర్తించి, చర్యలను వేగవంతం చేయాలన్నారు. త్వరితగతిన ప్రక్రియను పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. జిల్లాలో సాధ్యమైనంత త్వరలో స్థలాలు గుర్తించి, భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. పాత్రికేయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నిబంధనలను సరళతరం చేస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ వినతిని సమాచార శాఖ కమిషనర్‌కు పంపిస్తామని, ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు తప్పక స్థలం కేటాయిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. కమిటీ సభ్యులు డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, ఆర్డీఓలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత్ అంబరీష్, కె.చెన్నయ్య, డీపీఆర్‌ఓ టి.నాగేశ్వరరావు, పాత్రికేయులు జి.సూర్యదుర్గారావు, జి.నరసింహమూర్తి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రవి పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’ రాష్ట్రానికే పండుగ

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



క్రీడాకారులకు కిట్లు అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: ఆడుదాం ఆంధ్ర రాష్ట్రానికే పండుగ అని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్రలో భాగంగా వాలీబాల్, కబడ్డీ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ముందుగా మంత్రి ఇంటి వద్ద నుంచి క్రీడా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గురుకుల పాఠశాల విద్యార్థుల బ్యాండ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి కొట్టు మాట్లాడుతూ గ్రామ, పట్టణస్థాయి నుంచి జాతీయస్థాయికి పోటీ పడేలా క్రీడాకారులను తయారు చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశమన్నారు. శారీరక, మానసిక స్థైర్యానికి క్రీడలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు.

పట్టణంలో క్రికెట్ స్టేడియం : తాడేపల్లిగూడెంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి 12 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేసినట్టు మంత్రి కొట్టు తెలిపారు. కేటాయించిన స్థలం క్రికెట్ పిచ్‌తోపాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు క్రికెట్ ఆర్గనైజేషన్ అథారిటీ అధికారులతో చర్చిస్తామన్నారు. అలాగే పట్టణంలో మరిన్ని ఇండోర్ స్టేడియాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రాంగణం చుట్టూ డ్రెయినేజీ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అలాగే హైస్కూల్ ప్రాంగణంలో బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటుచేయాలని క్రీడాకారులు కోరగా సుముఖత వ్యక్తం చేశారు. రూ.13 లక్షలు ఖర్చవుతుందని క్రీడాధికారులు తెలియజేయగా నిధులు ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ శరత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, నాయకులు కర్రి భాస్కరరావు, కర్నాటి కన్నయ్య, సింగం సుబ్బారావు, బొద్దాని శ్రీనివాస్, పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని, ఆయన మార్గాన్ని యువత అనుసరించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం చిట్టవరంలో నిర్వహించిన అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడ స్వరాజ్య మైదానంలో నిర్మించిన అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఈనెల 19న సీఎం జగన్ ఆవిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి నరసాపురం నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఒక మతానికో, ఒక వర్గానికో చెందిన వారు కాదన్నారు. అలాంటి మహనీయుని విగ్రహాన్ని రూ.600 కోట్లతో ఏర్పాటుచేయడం సామాన్య విషయం కాదన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనలను దివంగత వైఎస్సార్ అనుసరించి పేదలకు ఉన్నత విద్యను అందించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. యువత అంబేడ్కర్ అభ్యుదయ భావాలను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సంతకాల సేకరణలో ఆయన సంతకం చేశారు. డీసీసీబీ డైరెక్టర్ ఇంజేటి జాన్ కెనడీ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు అంద్రాజు చల్లారావు, సర్పంచ్ తాడి లక్ష్మణరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకిలేటి ఆనందకుమార్, ఎంపీటీసీ నక్కా లక్ష్మీనారాయణ, మైలాబత్తుల శ్రీను, దొంగ మురళీకృష్ణ, చల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ ఘుమఘుమలు

సున్నుండలోయ్.. పోకుండలోయ్!
- సంక్రాంతి పిండి వంటల తయారీలో గృహిణులు బిజీ
- స్వీట్ స్టాల్స్‌లోనూ భారీగా ఆర్డర్లు
- రూ.12 కోట్లకు పైనే వ్యాపారం
- విదేశాల్లోని బంధువుల కోసం ప్రత్యేకంగా తయారీ



సంక్రాంతి పిండి వంటల తయారీలో మహిళలు



సిద్ధమైన సంక్రాంతి పిండి వంటలు

సాక్షి, భీమవరం: స్వీట్లలో వెరైటీలు ఎన్నొచ్చినా సంక్రాంతి వస్తోందంటే తెలుగునాట ప్రతి ఇల్లు సంప్రదాయ పిండి వంటలతో ఘుమఘుమలాడుతుంటుంది. సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో గృహిణులంతా సున్నుండలు, పోకుండలు, అరిసెలు, కజ్జికాయలు, జంతికలు, చల్లగుత్తులు వంటి పిండి వంటల తయారీలో బిజీ అయిపోయారు. కోవా, కలకండ, డ్రైఫ్రూట్స్ పోకుండలు, కజ్జికాయలు వంటి ఆధునిక పిండి వంటలు సైతం సంక్రాంతి వంటకాల్లో చేరి మరింత మాధుర్యాన్ని అందిస్తున్నాయి. పేద, ధనిక తారతమ్యం లేకుండా పల్లెల్లో ప్రతి ఇంటా పిండివంటల తయారీకి ప్రాధాన్యమిస్తారు. స్థోమత మేరకు జంతికలు, సున్నుండలు, బెల్లం ఉండలు, చల్లగుత్తులు, పోకుండలు, రవ్వ లడ్డూలు, పొంగడాలు, అరిసెలు, మైసూర్‌పాక్, కారపు బూందీ తదితర వెరైటీలు చేస్తుంటారు. కొత్తగా వివాహం జరిగిన ఇళ్లలో పిండి వంటల తయారీ మరింత సందడిగా ఉంటుంది. పండుగకు వచ్చే కొత్త అల్లుళ్ల కోసం ఎన్నో రకాల వంటలు సిద్ధం చేస్తుంటారు. దూరప్రాంతాల నుంచి పండుగకు వచ్చిన తమ కుటుంబ సభ్యులు, బంధువులకు తిరిగి వెళ్లే సమయంలో వాటిని అందిస్తుంటారు. కొందరు దేశ విదేశాల్లో ఉన్న తమ వారికి ప్రత్యేకంగా పిండి వంటలు తయారుచేసి పంపుతుంటారు.

ఆర్డర్లే.. ఆర్డర్లు : ఇళ్ల వద్ద పిండి వంటలు తయారు చేసుకునే తీరిక లేక స్వీట్స్ షాపుల్లో కొనుగోలు చేస్తున్న వారి సంఖ్య పట్టణాల్లో పెరుగుతోంది. ఏడాది పొడవునా బెంగాలీ, కలకండ, కోవా, కాజూ పేస్ట్ తదితర వెరైటీ స్వీట్స్ తయారుచేసే స్వీట్స్‌షాపుల నిర్వాహకులు సంక్రాంతి పండుగల్లో సంప్రదాయ పిండి వంటల తయారీకి ప్రాధాన్యమిస్తున్నారు. పోకుండలు, కజ్జికాయలు, కోవా, కలకండ, డ్రైఫ్రూట్స్ బూరెలతో సంప్రదాయ పిండి వంటల్లో ఆధునికతను జోడిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం తదితర చోట్ల పేరొందిన స్వీట్స్ షాపులతోపాటు చిన్న షాపుల్లోనూ సంక్రాంతి పిండి వంటల తయారీ ఎక్కువగా కనిపిస్తోంది. గ్రామాల్లో కేటరింగ్ నిర్వాహకులు, స్వీట్స్ తయారీదారులకు పెద్ద ఎత్తున ఆర్డర్లు వస్తున్నాయి. భీమవరం మండలం చినఅమిరం, కాళ్ల మండలం కోపల్లె, ఆకివీడు మండలం ఐ.భీమవరం, సిద్ధాపురం, యలమంచిలి మండలం కలగంపూడి తదితర చోట్ల ఇళ్ల వద్ద మహిళలు సంక్రాంతి పిండి వంటల తయారీ ద్వారా ఉపాధి పొందుతున్నారు. చెరువులు, హేచరీలు, వివిధ సంస్థల్లో పనిచేసే సిబ్బందికి పండుగ కానుకగా ఇచ్చేందుకు స్వీట్స్ ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయని తయారీదారులు అంటున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఆర్డర్లు ఎక్కువగా ఉన్నాయని, సంక్రాంతి రోజుల్లో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు సంక్రాంతి పిండి వంటల వ్యాపారం జరుగుతోందంటున్నారు. జిల్లాలో రూ.12 కోట్లకు పైనే వ్యాపారం జరుగుతుందని అంచనా.

ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయి



సంక్రాంతి పండుగలకు గతంతో పోలిస్తే ఇళ్ల వద్ద తయారీ తగ్గింది. ఈ ఏడాది ఆర్డర్లు ఎక్కువగా ఉన్నాయి. స్థానికంగానే కాకుండా దూరప్రాంతాల నుంచి ఆర్డర్లు ఎక్కువగా ఉన్నాయి.
– ఉద్దరాజు సీతాదేవి, ఐ.భీమవరం, ఆకివీడు మండలం

సంప్రదాయ పిండి వంటలకు డిమాండ్



సంక్రాంతి సీజన్ కావడంతో జంతికలు, సున్నుండలు, అరిసెలు తదితర సంప్రదాయ పిండి వంటల్ని అధికంగా అడుగుతున్నారు. అందుకే వాటి తయారీకి అధిక ప్రాధాన్యమిస్తున్నాం.
– వత్సవాయి ఆశ, కలగంపూడి, యలమంచిలి మండలం

క్లుప్తంగా

క్రికెట్ రాష్ట్ర జట్టుకు 'ఏవీఎస్ఎన్' విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం తదితరులు

పాలకొల్లు సెంట్రల్: స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత ఏడాది నిర్వహించిన అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పట్టణ ఏవీఎస్ఎన్ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థి షేక్ సమీరుద్దీన్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఆర్.విష్ణుమూర్తి బుధవారం చెప్పారు. ఈ నెల 16 నుంచి 24 వరకు బిహార్ రాజధాని పాట్నాలో జరిగే జాతీయ క్రికెట్ పోటీల్లో ఆడనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, పాఠశాల పీడీ పేర్రాజు తదితరులు విద్యార్థి షేక్ సమీరుద్దీన్‌ను అభినందించారు.

జిల్లా స్కౌట్ ట్రైనర్‌గా నాగేశ్వరరావు



కామవరపుకోట: భారత స్కౌట్ జిల్లా ట్రైనర్‌గా రావికంపాడు జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు బిరుదుగట్ల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నట్లు నాగేశ్వరరావు బుధవారం విలేకరులకు చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్ యూనిట్స్ ఏర్పాటు చేసి, విద్యార్థుల ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేముల నాగేశ్వరరావు, హెచ్ఎం ఉమ్మడి భీమరాజు, ఎంపీటీసీ సభ్యులు అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు ప్రసాద్ రెడ్డి, షేక్ మీరా సాహెబ్, కోటగిరి శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి ఆయనను అభినందించారు.

ఆస్తి కోసం కత్తితో అన్న దాడి

చికిత్స పొందుతూ తమ్ముడి మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

పెంటపాడు: ఆస్తి తగాదాల నేపథ్యంలో అన్న కత్తితో దాడి చేసిన ఘటనలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ తమ్ముడు బుధవారం మృతి చెందాడు. ఎస్సై జి.హరికృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆకుతీగపాడుకు చెందిన చిన్నం శ్రీను, చిన్నం వెంకటేశ్వర్లు (29) అన్నాదమ్ములు. పక్కపక్కనే పోర్షన్లలో వీరు ఉంటున్నారు. వీరిద్దరి భార్యలు గల్ఫ్‌లో ఉంటున్నారు. కొంతకాలంగా వీరి మధ్య ఆస్తితగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఈ విషయమై వాగ్వాదానికి దిగారు. దీంతో అన్న శ్రీను కోపంతో కూరగాయలు కోసే కత్తితో తమ్ముడు వెంకటేశ్వర్లుపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలతో ఉన్న వెంకటేశ్వర్లును స్థానికులు, బంధువులు గూడెం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు బుధవారం మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా సంక్రాంతి మార్కెట్

- కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న షాపులు, మాల్స్
- ఏటా సుమారు రూ.100 కోట్లపైనే వస్త్ర వ్యాపారం
- బంగారం రూ.30 కోట్లు, కిరాణా రూ.70 కోట్ల మేర కొనుగోళ్లు



భీమవరంలో కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న ఓ వస్త్ర దుకాణం



భీమవరంలోని ఓ బంగారం షాపులో విక్రయాలు

భీమవరం (ప్రకాశం చౌక్): సంక్రాంతి సందర్భంగా జిల్లాలోని ప్రధాన మార్కెట్లు వినియోగదారులతో కళకళలాడుతున్నాయి. పండుగ మరో మూడు రోజులు ఉండటంతో వస్త్ర, బంగారం, కిరాణా తదితర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతూ రద్దీగా మారుతున్నాయి. ఏటా సంక్రాంతికి జిల్లా వ్యాప్తంగా వస్త్ర వ్యాపారం రూ.100 కోట్లపైనే జరుగుతుంది. సంక్రాంతి మినహా మిగిలిన రోజుల్లో వస్త్రాల అమ్మకాలు మొత్తం రూ.50 కోట్లు ఉంటుండగా, ఒక్క సంక్రాంతి అమ్మకాలే రెండు రెట్లుగా ఉండటం విశేషం. జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు వంటి పట్టణాల్లో వస్త్ర దుకాణాలు, మాల్స్‌లో జోరుగా వ్యాపారం సాగుతోంది. ముఖ్యంగా భీమవరం, తణుకు పట్టణాల్లో బ్రాండెడ్ కంపెనీలు తమ షోరూమ్‌లను ఏర్పాటు చేయడంతో ఇక్కడ వ్యాపారం పుంజుకుంది. జిల్లాలో మొత్తం 1,500 వరకు వస్త్ర దుకాణాలు ఉండగా, రాష్ట్రంలో సంక్రాంతి వస్త్ర మార్కెట్‌కు భీమవరం నాలుగో స్థానంలో ఉంది.

బంగారం వ్యాపారంలోనూ అదే జోరు

సంక్రాంతి పండుగకు సంబంధించి బంగారు ఆభరణాలు కొనుగోళ్లు కూడా బాగా జరుగుతున్నాయి. కొత్తగా పెళ్లయిన ఆడపిల్లలు, అల్లుళ్లకు సంక్రాంతికి బంగారం పెట్టడం ఆనవాయితీ. దీంతో మధ్యతరగతి నుంచి సంపన్నుల వరకు బంగారం కొనుగోళ్లు చేస్తున్నారు. ఏటా పండుగకు బంగారం వ్యాపారం రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు జరుగుతున్నట్టు అంచనా. ఇప్పటివరకు రూ.15 కోట్ల మేర వ్యాపారం జరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

భారీగా కిరాణా అమ్మకాలు

సంక్రాంతి పండుగకు కోసం భారీగా కిరాణా సరుకులు కొనుగోలు చేస్తున్నారు. పిండి వంటల తయారీ కోసం సరుకులు కొనేందుకు వెళ్లిన వినియోగదారులతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతితో పాటు ఈనెలలోనే జిల్లాలో జరిగే అమ్మవార్ల జాతర్లకు భోజనాలకు ముందస్తుగానే సరుకులు కొనుగోలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సీజన్‌లో రూ.70 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు కిరాణా వ్యాపారం జరుగుతున్న అంచనా.

ఆన్‌లైన్ షాపింగ్‌లోనూ..

జిల్లా పరిధిలో ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోళ్లు కూడా ఎక్కువే. ముఖ్యంగా యువత 50 శాతం ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు. వారికి అవసరమైన వస్తువులను ఇంటి నుంచి లేదా ఆఫీసు నుంచి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.10 కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని అంచనా.

ఫ్యాక్టరీల్లో రక్షణ చర్యలు తప్పనిసరి

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలో ఉన్న అన్ని ఫ్యాక్టరీలలో తప్పనిసరిగా రక్షణ చర్యలు ఉండేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఫ్యాక్టరీలు, పెట్రోల్ బంకులలో ఉండాల్సిన రక్షణ చర్యలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన 61 ఐస్ ఫ్యాక్టరీలలో రక్షణ చర్యలను పర్యవేక్షించి నివేదిక అందజేయాలన్నారు. పరిశ్రమలు, ఫ్యాక్టరీలు తప్పనిసరిగా పరిశ్రమల శాఖ లేదా కార్మిక శాఖలో నమోదై ఉండాలన్నారు. రొయ్యలు ఫ్యాక్టరీలలో ఉండే అమోనియా ఐస్ ఫ్యాక్టరీల్లో కూడా ఉంటుందని, దీని ప్రమాద తీవ్రతను గుర్తించి రొయ్యల ఫ్యాక్టరీలలో చేపట్టిన రక్షణ చర్యలను ఐస్ ఫ్యాక్టరీలలో కూడా చేపట్టాలన్నారు. అలాగే పెట్రోల్ బంకులలో రక్షణ చర్యలపై కూడా నివేదికను అందజేయాలన్నారు. రక్షణ చర్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాథరావు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ పి.శ్రీనివాస్, జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, ఉయ్యాల ఆదిశేషు పాల్గొన్నారు .

12 నుంచి ధర్మ ప్రచార మహోత్సవాలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి



మహోత్సవాల కరపత్రాలను విడుదల చేసిన ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో దేవదాయ శాఖ నిర్వహణలో ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని బలుసులమ్మ ఆలయ ప్రాంగణంలో జనవరి 12 నుంచి ఫిబ్రవరి 29 వరకు ధర్మ ప్రచార మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. పట్టణంలోని శ్రీబలుసులమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి కొట్టు మాట్లాడారు. ఈ నెల 12న విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి కల్యాణం, 13న శ్రీకనకదుర్గ అమ్మవారికి ఖడ్గమాల, కుంకుమార్చన, 19న శ్రీకాళహస్తి జ్ఞాన ప్రసూనాంబిక శ్రీకాళహస్తీశ్వరస్వామివార్ల కల్యాణం, 20న శ్రీకాళహస్తీ రాహుకేతు పూజ, 25న శ్రీశైలం శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్ల కల్యాణం, 26న శ్రీభ్రమరాంబ అమ్మవారికి ఖడ్గమాల కుంకుమార్చన, 30న అనంత లక్ష్మీసత్యవతీ శ్రీసత్యనారాయణస్వామి వార్ల కల్యాణం, 31న అన్నవరం శ్రీసత్యనారాయణ స్వామివారి వ్రతం, ఫిబ్రవరి 3న వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం చుట్టూ 7 ప్రదక్షణలు మాదిరిగా గూడెంలో ఏర్పాట్లు, సాయంత్రం స్వామివారి కల్యాణం, 7న శ్రీవిఘ్నేశ్వరస్వామివారి కల్యాణం, 8న వినాయక విజయ హోమాలు, 11న సింహాచల శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం, 24న ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి కల్యాణం, 28న కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారి కల్యాణం, 29న కాణిపాక వినాయక విశిష్ట గణపతి హోమం నిర్వహిస్తారని మంత్రి కొట్టు చెప్పారు. ఈ పూజల్లో వెయ్యి మంది దంపతులు పాల్గొనవచ్చన్నారు. పూజల్లో పాల్గొనే దంపతులు తమ పేర్లను నమోదు చేయించుకుని టోకెన్లు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ధర్మ ప్రచార మహోత్సవాల కరపత్రాన్ని మంత్రి కొట్టు విడుదల చేశారు.

భారీగా తాబేళ్ల పట్టివేత

కైకలూరు/కలిదిండి: నాటు తాబేళ్లను తరలిస్తున్న ముఠా తాబేళ్లను దిలి పరారైన ఘటన కలిదిండి మండలం సానారుద్రవరంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. కైకలూరు అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం సానారుద్రవరం గ్రామ రహదారి సమీపంలో బస్తాలు పడి ఉన్నాయని, అవి కదులుతున్నాయని కలిదిండి పోలీసులకు సమాచారం అందింది. దీంతో హుటాహుటిన పోలీసులు అక్కడకు చేరుకునేసరికి ఎవరూ లేరు. బస్తా మూటలను విప్పి చూడగా అందులో నాటు తాబేళ్లు కనిపించాయి. కైకలూరు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో డెప్యూటి ఫారెస్టు ఆఫీసరు సూర్యప్రకాష్, ఫారెస్టు బీటు ఆఫీసరు కావడి వెంకన్న సిబ్బందితో వచ్చి తాబేళ్లను స్వాధీనం చేసుకుని కైకలూరు సమీపంలోని డ్రెయిన్‌లో కొల్లేరు పర్యావరణ అభివృద్ధి కమిటీ చైర్మన్ సుబ్బారావు సమక్షంలో విడిచిపెట్టారు. డీఆర్వో సూర్యప్రకాష్ మాట్లాడుతూ మొత్తం 46 బస్తాలలో వివిధ సైజులలో 350 తాబేళ్లను గుర్తించామన్నారు. పర్యావరణంలో తాబేళ్లకు విశిష్టస్థానం ఉందన్నారు. వీటిని రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు



పెనుగొండలో నిందితుడు, స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

పెనుగొండ: చెడు వ్యసనాలకు అలవాటు పడి మోటార్‌సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి రూ.8 లక్షల విలువైన ఏడు మోటారు సైకిళ్లను పెనుగొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. తమకు అందిన సమాచారంతో పెనుగొండలోని ఎస్వీకేపీ కళాశాల కూడలిలో పోలీసులు వాహనాల తనిఖీ చేయగా, అనుమానస్పద స్థితిలో ఉన్న మార్టేరుకు చెందిన చిర్ల జగన్మోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారణ చేయగా, స్నేహితుడు హర్షవర్దన్‌రెడ్డిరెడ్డితో కలిసి వ్యసనాల అవసరాలు తీర్చుకోవడానికి గత ఏడాది జూన్ నుంచి పెనుగొండ పరిసర ప్రాంతాల్లో మారుతాళాలతో మోటార్ సైకిళ్లను చోరీ చేస్తున్నట్లు, కొంతకాలం తరువాత వీటిని అమ్ముకోవాలన్న ఆలోచనతో నిందితులు ఉన్నాట్లు పోలీసులు గుర్తించారు. ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశాలతో డీఎస్పీ రవి మనోహరచారి నేతృత్వంలో సీఐ డి.వెంకటేశ్వరరావు, ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ మోటార్ సైకిళ్ల చోరీ కేసులను ఛేదించారు. నిందితుడి నుంచి ఏడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ, ఎస్సైలతో పాటు ఏఎస్సై శ్రీధర్, సిబ్బంది ఎం.సత్యనారాయన, సీహెచ్‌వీవీ రామారెడ్డి, జె.రాధాకృష్ణ, కె.శ్రీనివాస్‌లను ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

భీమవరానికి పూర్తి స్థాయిలో తాగునీరు

- విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- బృహత్తర మంచినీటి పథకం ప్రారంభం



ఫిల్టరేషన్ ప్లాంట్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణానికి పూర్తి స్థాయిలో తాగునీరు అందించే బృహత్తర మంచినీటి పథకాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. పైపుల చెరువు రోడ్డులో అమృత్ ఫేజ్-2లో రూ.36.50 కోట్ల వ్యయంతో రోజుకు 1 కోటి 70 లక్షల లీటర్లు అందించే ఫిల్టరేషన్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే గ్రంధి ప్రారంభించి ప్లాంట్‌లో అన్ని విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి శుద్ధి విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకుని వారికి పలు సూచనలు జారీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో సుమారుగా మూడు లక్షల మంది ప్రజలకు ఒకే సమయంలో శుద్ధి చేసిన తాగునీరు అందిస్తామన్నారు. రోజుకు 1.70 కోట్ల లీటర్లు కలుపుకుని ఇప్పటికే సరఫరా అవుతున్న 1.50 కోట్ల లీటర్లతో మొత్తం 3.20 కోట్ల లీటర్లకు మంచినీటి సరఫరా సామర్థ్యం పెరిగిందన్నారు. ఈ పథకంలో నిర్మించిన మూడు వాటర్ రిజర్వాయర్లు పూర్తి అయ్యాయని, త్వరలో వాటిని కూడా ప్రారంభించి మంచినీరు పుష్కలంగా అందిస్తామన్నారు. మూడు రిజర్వయర్లు సంబంధించి చివరి ప్రాంతాలకు సైతం నీళ్లు అందించడానికి రూ.2.87 కోట్ల వ్యయంతో చేపట్టిన పైపులైన్ల నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయన్నారు. భీమవరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

కళాశాల బస్సు ఢీకొని భార్యాభర్తల దుర్మరణం



ఘటనా స్థలంలో గన్నవరపు మరియమ్మ మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్ : పెదతాడేపల్లి వద్ద జాతీయ రహదారిపై బైక్‌ను ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలు మృతి చెందగా, ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నందమూరు గ్రామానికి చెందిన గన్నవరపు మరియమ్మ, గన్నవరపు ధనరాజు తమ పిల్లలతో కలిసి మోటారు సైకిల్‌పై చేబ్రోలులో ఓ ఫంక్షన్‌కు వెళుతున్నారు. పెదతాడేపల్లి వద్ద జాతీయ రహదారిపై తిరుమల సాయినగర్ వద్దకు వచ్చేసరికి వీరిని వెనుక నుంచి ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో గన్నవరపు మరియమ్మ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, తీవ్ర గాయాలపాలైన ధనరాజును తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మరియమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని బంధువు అక్కాబత్తుల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై బి.రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

ఏలూరు (టూటౌన్): ఏలూరులో రెండు రోజుల పాటు జరిగే సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు స్థానిక శ్రీ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ప్రారంభమయ్యాయి. సమావేశాలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పర్యవేక్షకులుగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎంఎ బేబీ హాజరయ్యారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని ప్రజాసమస్యలు, పరిణామాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

క్లుప్తంగా

ఉమా చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు


ఉమాచంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో మార్గశిర మాసం బుధవారం మాస శివరాత్రి సందర్భంగా ఉమా చంద్రశేఖర్ స్వామికి పంచామృతాలతో, పలరసాలు, సుగంధ ద్రవ్యాలు, పాలతో విశేషంగా అభిషేకాలు జరిగాయి. విశేష అలంకరణలు గావించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నిర్వాహకులు నున్న బాల త్రిపుర సుందర రావు, పేరూరి కాశయ్య, ఆలపాటి చిన్న, ఆర్య వైశ్యలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా నూతన కౌన్సిల్‌కు అభినందనలు


ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీటీఎఫ్ జిల్లా నూతన కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా నిర్వహించారు. అనంతరం నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. పలువురు బుధవారం నూతన కౌన్సిల్ సభ్యులను పలువురు అభినందించారు. జిల్లా అధ్యక్షుడిగా జి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శిగా బీవీ నారాయణ, ఉపాధ్యక్షుడిగా ఝూన్సీ, విజయకుమారి, లంకా రాజు, వీరభద్రరావు, రాంబాబు, జిల్లా కార్యదర్శిలుగా జనార్ధన్‌స్వామి, రామ్మోహన్, కుమార్, రాఘువులు, సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పార్వతి దేవి, ఆడిట్ కమిటీ సభ్యులుగా విజయబాబు, ఎం.పుష్పరాజ్, అంజిబాబు, కృష్ణవేణి, జాన్సన్‌లు పాల్గొన్నారు.

విశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


విశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూలతో అలకరించిన దృశ్యం

పెంటపాడు: మండలంలోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ బ్రహ్మత్వంలో ఏకాదశ రుద్రాభిషేకం, సామూహిక కుంకుమార్చన, రుద్రహోమం, శాంతి కల్యాణం, నిరాజన మంత్రపుష్పాలు తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వింజమూరి పార్ధసారథి, కోడే కాళి, తదితరులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

వాలీబాల్ విజేతగా ఆరవల్లి జట్టు


మండల స్థాయి వాలీబాట్ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టును అభినందిస్తున్న ఎంపీడీవో

అత్తిలి: మండల స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడా వాలీబాల్ పోటీల్లో ఆరవల్లి జట్టు విజేతగా నిలిచింది. ఈజట్టు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని ఎంపీడీవో ఎండీ అమీలు జమా తెలిపారు. ఈ సందర్భంగా వాలీబాల్ విజేత జట్టును ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ రమేష్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యద్దనపూడి స్మారక అవార్డు ఎంట్రీలకు ఆహ్వానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సంఘ సేవకులు, ప్రముఖ పాత్రికేయులు యద్దనపూడి సూర్య నారాయణ మూర్తి స్మారక ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు-2024 కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు అవార్డు ఎంపిక కమిటీ డి.సోమసుందర్ వెల్లడించారు. 2023 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సంవత్సరంలో ప్రచురితమైన ప్రత్యేక కథనాలు, విశ్లేషణా వ్యాసాలు, మానవీయ కథనాలను ఎంట్రీలుగా పంపవచ్చునని తెలిపారు. జనవరి 25వ తేదీలోపుగా ఎంట్రీలను అవార్డు కమిటీకి పంపాలన్నారు. జనవరి 31వ తేదీన యద్దనపూడి వర్ధంతికి అవార్డులు ప్రధానం చేస్తారని వెల్లడించారు. మరన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ 98660 74026ను సంప్రదించాలని కోరారు.

పేదల కుటుంబాల్లో వెలుగులు

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- ముగిసిన మొదట విడత ప్రజా దీవెన యాత్ర


ఇరగవరంలో సమస్యలు తెలుపే సమ్యలు వింటున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: పేదల కుటుంబంలో వెలుగులు, ఆనందం నింపాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం ఇరగవరం మండలంలోని ఇరగవరం, అనుమాజీ పాలెం, గొల్లగుంట పాలెం, గొల్లమాల పల్లి, పిల్లి వారి పాలెం, చినరాముని చెరువు, వేంద్ర వారి పాలెం, మెయిన్ రోడ్‌లో ప్రజా దీవెన పాద యాత్ర కొనసాగింది. మొదట విడత పాద యాత్ర బుధవారంతో ముగియడంతో పాద యాత్రను విజయవంతం చేసిన నియోజవర్గ ప్రజకు కృతజ్ఞతులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పారీలకతీతంగా పథకాలను అందించామన్నారు. సచివాలంయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువచ్చామన్నారు. పేదల గుండె చప్పుడు జగన్ అన్నారు. జగన్‌ను మళ్లీ సీఎంగా చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం జగన్ ప్రకటించిన నవరత్నాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని తెలిపారు. పేదరికమే అర్హతగా సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు పారదర్శకంగా ఎంపిక చేసి అందజేస్తున్నామన్నారు. జగన్ సీఎం అయిన తరువాత రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు, గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రగతికి, ప్రజా సంక్షేమానికి పనిచేస్తున్నారని, అటువంటి నాయకుడిని వచ్చే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు మద్దతుగా నిలవాలని మంత్రి కోరారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచారన్నారు. ముఖ్యంగా పేదవాడి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25లక్షల పెంచారని, ఇది దేశంలోనే ప్రథమమన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ కొప్పిశెటి అలివేలు మంగ తాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు చవ్వాకుల శ్రీనివాస్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, నియోజక వర్గ ఎస్సీ నాయకులు పొట్ల సురేష్, ఎంపీటీసీలు మంగెన రామా నాయుడు, పాలేశ్వరరావు, తణుకు నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి


గూడెం రైల్వేస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

తాడేపల్లిగూడెం: కార్మికులకు గుదిబండగా ఉన్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఆలిండియా రైల్వేమెన్‌ఫెడరేషన్ , సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్, జాయింట్ ఫోరం ఫర్ రెస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు,కార్మికులు స్థానిక రైల్వే స్టేషన్ వద్ద బుధవారం ఆందోళన చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఉద్యోగులు, కార్మికులనుద్దేశించి నాయకులు మాట్లాడారు. గూడెం బ్రాంచ్ చైర్మన్ కె.మనోహర బాబు, సెక్రటరీ దానయ్య, బి.భాస్కరరావు, వై.ప్రశాంత్, వై.నాగరాజు, ఎస్.వెంకటరావు, కె.కోటేశ్వర రావు, టి.వెంకటరావు దీక్షలో పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడల ప్రోత్సాహమే లక్ష్యం


తాడేపల్లిగూడెం రూరల్: మాధవరంలో ఆడుదాం అంధ్ర పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం


పెంటపాడు: ఆడుదాం అంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ సూర్యకళ

- ఏఎంసీ ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: ఆడుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ తెలిపారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా బుధవారం మండలంలోని పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. మొత్తం 35 టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టు విశాల్ మాట్లాడుతూ విద్యార్థులు శారీరక వికాసానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఆటల పోటీల్లో పాల్గొని గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రతిభకనబర్చి రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జద్దు హరిబాబు, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, సర్పంచ్‌లు ఎలిపే గాంధీ, ఉండ్రాజవరపు చంద్రిక, పోతుల అన్నవరం, దండే కనకబాబు, సొసైటీ మాజీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి, పంచాయతీ ఈవో కే.శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీబ్రహ్మం, బి.అప్పారావు, బి.ఫణికుమార్, బి.రమేష్, పీఈటీలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర

పెంటపాడు: మండలంలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం ఉత్సాహభరితంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాలకు చెందిన యువత, గ్రామస్థాయిలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు పాల్గొన్నారు. పెంటపాడు, రావిపాడు, మీనవిల్లూరు, కొండేపాడు, రామచంద్రపురం యువతతో నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటపాడు సర్పంచ్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెంటపాడు బేసిక్ పాఠశాల, కళాశాల సెంటర్, ఎస్‌టీవీఎస్ హిందూ హై స్కూల్, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం


తణుకులో కబడ్డీ టీం విజేతకు రూ. 30వేలు నగదును అందజేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి యలమరెడ్డి శ్రీకాంత్ ఆధ్వర్యంలో కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహించిన ప్రో కబడ్డీ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ మూడు జిల్లాల ప్రో కబడ్డీ పోటీలు తణుకులో నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడా పోటీలు నిర్వహించేవారంటే తనకు ఇష్టమని ఈ కబడ్డీ పోటీలు నిర్వహించిన శ్రీకాంత్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు. క్రీడా పోటీల నిర్వహణకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ కబడ్డీ క్రీడకు ఉపయోగించే ఖరీదైన మ్యాట్‌లు ఇప్పించమని కోరిన వెంటనే తణుకు, వేల్పూరు కబడ్డీ టీంలకు గతంలో రెండు జతల మ్యాట్ సెట్‌లు మంత్రి కారుమూరి ఉచితంగా అందచేశారని కొనియాడారు. అనంతరం విజేతగా నిలిచిన విజయవాడ సై్క టీం సభ్యులకు మంత్రి కారుమూరి రూ.30వేలు బహుమతిగా అందచేశారు. ఈ కార్యక్రమంలో దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్ర, చేబ్రోలు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద యువతకు ఆదర్శనీయుడు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేసిన స్వామి వివేకానంద నేటి విద్యార్థినీ, విద్యార్థులు, యువతకు ఆదర్శనీయుడని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధాకర్ చెప్పారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా తణుకు ఎస్వీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాంస్కృతిక విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తణుకు రామకృష్ణ సేవా సమితి నిర్వాహకులు మల్లిన రామచంద్రరావు, డాక్టర్ టీ రామబ్రహ్మం, చిలుకూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో...

తణుకు మహిళా కళాశాలలో జిల్లా యువజన సర్వీసులు, సెట్‌వెల్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 161వ జయంతి, సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు, పోస్టర్ పెయింటింగ్, వకృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ సెట్‌వెల్ సీఈవో ఎండీ మొహరాజ్, కళాశాల ప్రిన్సిపాల్ కె రామకృష్ణ, కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, కల్చరల్ అధ్యాపకులు శివప్రసాద్, కేవీ శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎస్సీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం జగన్ ప్రభుత్వ పాలన జరుగుతోందని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని దళిత వాడల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ఈ సందర్భంగా అనుమాజీపాలెంలో బాబు జగ్జీవన్ రావు విగ్రహం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా తక్షణమే స్పందించి వెంటనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, ఇరగవరం మండల కన్వీనర్ ఎస్ వి జాకబ్, ఇరగవరం సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు చేబ్రోలు పెద్దిరాజు, కొడమంచిలి శ్యాం బాబు, ఘనసాల రవి కిరణ్, కోటి దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలకు దూరంగా ఉండాలి

పాలకోడేరు: సంక్రాంతి సందర్భంగా ఎవరైనా కోడి పందేలు, జూదం, కోత ఆట, గుండాట, బెట్టింగులు హైకోర్టు ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు పాలకోడేరు మండలంలో ఆటోలో మైకు ద్వారా ప్రచారం చేస్తున్నారు. కోడి పందేలు ఆడినా, పాల్గొన్నా, స్థలాలు, టెంటులు, షామియానాలు, సామగ్రి అద్దెకిచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి


సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

పెంటపాడు: విజయవాడ పీడబ్ల్యూ గ్రౌండ్‌లో ఈ నెల 19న నిర్వహించే భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అంబేడ్కర్‌వాదులు, మానవతావాదులు, దళిత బహుజన సంఘాల నాయకులంతా హాజరుకావాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు కోరారు. బుధవారం పెంటపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రూ.377 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసి అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించి, ప్రజలకు అంకితం చేస్తారని చెప్పారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆచంట, తిరువూరు సభలో జనంలేక వెలవెలబోయాయని ఆరోపించారు. ఇచ్చిన హామీల అమలు చేయని చంద్రబాబును ప్రజలు నమ్మేస్థితిలో లేరని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాల పేదలంతా సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించడం ఖాయమని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, ఎంఈవో రామకృష్ణ, గుంపుల సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 3,500 టిడ్కో గృహాల అప్పగింత

భీమవరం (ప్రకాశం చౌక్): ఈనెల 20వ తేదీ తర్వాత సుమారు 3, 500 మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అప్పగిస్తామని ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన పైపుల చెరువు రోడ్డులో నిర్మించిన ఫిల్టరేషన్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మొదటిసారి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణంలో కొన్ని వార్డుల్లో మంచినీటి ట్యాంకర్ల కోసం బిందెలు పట్టుకుని ప్రజలు నిలబడే పరిస్థితి ఉందని, ఆ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని 126 ఎకరాల భూమిని సేకరించి 66 ఎకరాల్లో నాడు మహానేత వైఎస్సార్ సహకారంతో రూ.9 కోట్ల నిధులతో భారీ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించి చాలా వరకూ తాగునీటి సమస్యను అరికట్టామని వివరించారు. 2019లో రెండోసారి ఎమ్మెల్యేగా అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణంలో తాగునీటి సరఫరాకు సంబంధించి అభివృద్ధి పనులు చేశామన్నారు. అమృత 2.0 లో మరో రూ.47 కోట్లు మంజూరు చేయించామని, 2053 సంవత్సరం వరకు పట్టణంలో పెరుగుతున్న జనాభా దృష్టిలో పెట్టుకుని అదనపు ఓహెచ్‌ఆర్‌లను, అదనపు పైపులైన్లను నిర్మించడానికి డిజైన్ తయారు చేస్తున్నామని వివరించారు. అమృత పథకంలో 4, 39, 31వ వార్డుల్లో నిర్మించిన మంచినీటి రిజర్వాయర్లను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఈ భారీ మంచినీటి పథకంతో టిడ్కో గృహాలకు నేరుగా ఇక్కడి నుండే మంచినీరు సరఫరా చేస్తారని తెలిపారు. ఈనెల 20వ తేదీ దాటిన తర్వాత సుమారుగా 3, 500 మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అప్పగిస్తామని అన్నారు. వెయ్యి గృహాల వరకు పూర్తిగా అన్ని సదుపాయాలను కల్పించామని, మిగిలిన 2, 500 గృహాలకు ఫినిషింగ్ వర్క్ చేస్తున్నారని వివరించారు. పనులు పూర్తి చేసే సమయనికి ఎన్నికల నోటిఫికేషన్ వస్తే గృహ ప్రవేశాలకు ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉందని, మే నెల నుంచి ఆరు నెలల వరకు గృహప్రవేశ ముహూర్తాలు లేవని, అందుకే 3,500 గృహాలను ముందుగానే ఇవ్వనున్నట్టు వెల్లడించారు.

సీసీ రోడ్ల ప్రారంభోత్సవం

భీమరం 1, 4, 5వ వార్డుల్లో సుమారు రూ.1.70 కోట్లుతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. గత నాలుగున్నరేళ్లల్లో రూ.100 కోట్ల నిధులతో భీమవరంలో అభివృద్ధి చేశామన్నారు. ప్రస్తుతం మరికొన్ని అభివృద్ధి పనులు ఆయా వార్డుల్లో నిర్వహిస్తున్నామని, మరిన్ని అభివృద్ధి పనులకు త్వరలోనే నిధులు మంజూరవుతాయని, పనులు కూడా వెంటనే ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రతి వార్డు అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తుమని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, ఎంఈ త్రినాథరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గోయెంకాలో బీఏ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆత్మీయంగా కలిసిన 1992-95 పూర్వ విద్యార్థులు

పెంటపాడు: పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం 1992-95 సంవత్సర కాలంలో బీఏ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక వైభవంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్వ విద్యార్థులు స్థానిక కళాశాల ఆడిటోరియంలో కుటుంబాలతో సహా హాజరై అనాటి స్మృతులను నెమరువేసుకొన్నారు. ఈ సందర్భంగా అప్పటి ప్రిన్సిపాల్, జువాలజీ అధ్యాపకులు రామారావును, ప్రస్తుత ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌ను, రచయిత సుంకర గోపాలయ్యను ఘనంగా సన్మానించారు. కళాశాల ఆడిటోరియంలో ఏసీ లేక, అక్కడ టైల్స్ వేయించేందుకు ఏకగ్రీవంగా నిర్ణయించుకొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మైనారిటీ నాయకులు షేక్‌లాల్‌భాషా, వేణు,విశ్వేశ్వర రావు, శ్రీనివాస్, దుర్గారెడ్డి, బోసుబాబు, పద్మిణి, స్వర్ణలత, సుజాత, వీరకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు

తణుకు టౌన్: అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం సాయంత్రం తణుకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన జనభాగీదారి, సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. విజయవాడలో ఈనెల 19న బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో భాగంగా జన భాగిధారి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో కె కిరణ్‌కుమార్, ఎంఈవో మురళీ సత్యనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు కత్తుల జస్పాల్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, ఉపాధ్యా సంఘం నాయకుడు ఎం సుధాకర్, గంజి మధు, లతో పాటు వివిధ సచివాలయాలు, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.